సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం : 10 : జూన్ : 2024



సోమశిలలో 7.52 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 7.525 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 2966 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,320
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,567
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,764
సవర (8 గ్రాములు)	రూ.54,112



జొన్నవాడలో విశేష పూజలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో వాడయతు ఉత్సవాన్ని నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చారు.

న్యూస్‌రీల్

జేఈఈలో 'నారాయణ' విజయభేరి



నెల్లూరు(అర్బన్): ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నారాయణ ఐఐటీ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులను సాధించారని విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఉత్తమ ర్యాంకులను సాధించిన విద్యార్థులను హరనాథపురంలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఆదివారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయిలో అన్ని కేటగిరీల్లో 1, 2, 3, 4, 6, 11వ ర్యాంకులను తమ విద్యార్థులు సాధించడం గర్వకారణమన్నారు. ఓపెన్ కేటగిరీలో సూరజ్ 134, సుబ్రహ్మణ్య కల్యాణరామ్ గణేష్ 1138, సాయినితీష్ 1664, శ్రీనికేష్ 1949, రితేష్‌రెడ్డి 2177, లావణ్య చంద్రిక 2554, చక్రేష్ 2976 ర్యాంకులను సాధిచారని చెప్పారు.

'విశ్వసాయి' అత్యుత్తమ ప్రతిభ



నెల్లూరు(అర్బన్): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచారని విశ్వసాయి జూనియర్ కళాశాల చైర్మన్ డాక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకులను సాధించిన విద్యార్థులను మాగుంట లేఅవుట్లోని కళాశాలలో ఆదివారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. శరణ్వేష్ జాతీయ స్థాయిలో 3430, దివ్యశ్రీ 5333, కార్తీక్ 1430, సిద్ధార్థమార్య 4316 ర్యాంకులను సాధించారని వివరించారు. విద్యాసంస్థల వైస్ చైర్మన్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం



నివాళులర్పిస్తున్న ఎస్టీయూ నేతలు

నెల్లూరు(అర్బన్): నగరంలోని రైల్వేఫీడర్స్ రోడ్డులో గల ఎస్టీయూ కార్యాలయంలో ఆ సంఘ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయ ఉద్యమ నేతలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు అశోక్‌బాబు మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటాన్ని చేస్తున్నామని చెప్పారు. సంఘ ప్రధాన కార్యదర్శి రాజమనోహర్, నేతలు నరసింహం, వీరాస్వామి, వెంకటేశ్వర్లు, ప్రశాంత్‌కుమార్, ప్రసాద్‌రెడ్డి, మక్దూమ్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



చిల్లకూరు: తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలను ఆదివారం నిర్వహించారు. వేకువనే సుప్రభాతసేవను జరిపారు. మూలమూర్తికి విశేషాభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ఆవరణలో మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యాన్ని సమర్పించారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, ఈఓ నవీన్‌కుమార్, సభ్యుడు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు.

లాభాలు జూమ్

- కాసులు కురిపిస్తున్న జామాయిల్ సాగు
- టన్ను కర్ర ధర రూ.3,500
- ఎకరాలో సవక కలప రూ.మూడు లక్షలు
- నాణ్యత ఉంటే పెరుగుతున్న ధరలు
- గతంలో టన్ను కేవలం రూ.1,400

జిల్లాలో సాగు తీరు..

జామాయిల్:	సవక:
1.20 లక్షల ఎకరాలు	80 వేల ఎకరాలు



జామాయిల్ తోటలు

పొదలకూరు: జామాయిల్, సవక సాగు లాభదాయకంగా మారింది. గతంలో నష్టాలకు వీటిని విక్రయించుకోవాల్సి వచ్చేది. పెట్టుబడులు సైతం రాక గిట్టుబాటు ధరల్లేక అల్లాడారు. సుబాబుల్‌తో పాటు సవక, జామాయిల్ కర్రకు మద్దతు ధర లభించడంతో జిల్లాలో లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న మెట్ట ప్రాంతాల్లో ప్రత్యామ్నాయం లేక చాలా మంది రైతులు జామాయిల్ సాగునే నమ్ముకున్నారు. ఐదేళ్లకోసారి కటింగ్‌కు వచ్చే జామాయిల్‌తో రైతులు ఆర్థిక స్వావలంబన పొందేవారు. క్రమంగా జామాయిల్, సవకను అడిగే వారు లేకుండాపోయారు. ఫలితంగా ఐదేళ్లపాటు దీనావస్థలో రైతులు కొట్టుమిట్టాడారు. మరోవైపు జామాయిల్ కర్రను కొనుగోలు చేసే ఫ్యాక్టరీలు రైతులను నిలువునా మోసగిస్తున్నాయనే ఆరోపణలు వినిపించేవి.

పూర్తిగా మారిన పరిస్థితి

అయితే ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా మారింది. డిమాండ్ పెరగడంతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోంది. సవకకు డిమాండ్ పెరగడంతో ఎకరాకు రూ.మూడు లక్షల వరకు ధర లభిస్తోందని రైతులు వెల్లడించారు.



సవక తోటలు

జామాయిల్ సాగు ఇలా..

జిల్లాలోని 1.2 లక్షల ఎకరాల్లో జామాయిల్ సాగవుతోంది. లక్ష ఎకరాల్లో తోటలు కటింగ్‌కు సిద్ధంగా ఉన్నాయని తెలుస్తోంది. మరో 80 వేల ఎకరాల్లో సవక తోటలు ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఫైర్ ఉడ్, ప్లయ్‌ఉడ్, కాగితపు తయారీ, భవన నిర్మాణాలకు జామాయిల్, సవక కర్రలను వినియోగిస్తున్నారు. మహారాష్ట్రలోని బలార్షలో గల ఫ్యాక్టరీ యాజమాన్యం టన్నుల కొద్దీ తాటతీసిన జామాయిల్‌ను కొనుగోలు చేస్తోంది. దీని కోసం రూ.4,500 (డీబార్) చెల్లిస్తున్నారు. అదే విధంగా జిల్లా నుంచి జామాయిల్ కర్రను శ్రీకాళహస్తిలోని చెంబేడులో గల గ్రీన్‌ప్లయ్ ఫ్యాక్టరీ టన్నుకు రూ.నాలుగు వేలు చెల్లిస్తోంది. నాన్ డీబార్ రకం కర్ర అయితే టన్నుకు రూ.3,200 వరకు చెల్లిస్తున్నారు. దీనికి లారీ బాడుగ, కర్ర నరికేందుకు కూలీల ఖర్చులను రైతులు భరించాల్సి ఉంటుంది. టన్నుకు నికరంగా రైతుకు రూ.2,100 నుంచి రూ.2,400 వరకు గిట్టుబాటవుతోంది. గతంలో అన్ని ఖర్చులు పోను రూ.1,200 నుంచి రూ.1,400 కూడా గిట్టుబాటయ్యేది కాదు.

80 శాతం కొనుగోలు

జిల్లాలో జామాయిల్ కర్రను 80 శాతం గ్రీన్‌ప్లయ్ యాజమాన్యమే కొనుగోలు చేస్తోంది. ఈ కంపెనీ ప్లయ్‌ఉడ్‌కు మంచి మార్కెట్, బ్రాండ్ ఇమేజ్ ఉంది. ఫలితంగా ఫ్యాక్టరీలు ధరలను పెంచి కర్రను కొనుగోలు చేస్తున్నాయి. మార్కెటింగ్ శాఖ చెక్‌పోస్టుల్లో వే బిల్లులను తనిఖీ చేస్తున్నారు. సవక, జామాయిల్‌కు డిమాండ్ పెరగడంతో దళారులు ఎకరాలకు ఎకరాలు కొనుగోలు చేస్తున్నారు. మరో ఆర్నెల్ల తర్వాత ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఉన్న తోటలను కొనుగోలు చేసి కర్రను తరలిస్తే డిమాండ్ ఏర్పడి ధరలు మరింత పెరుగుతాయని పలువురు పేర్కొంటున్నారు. మండలంలోని విరువూరు, సూరాయపాళెం, ఇనుకుర్తి, పెదరాజుపాళెం తదితర గ్రామాల్లో సవక తోటలు ఉన్నాయి. జామాయిల్ తోటలు ప్రతి గ్రామంలో సాగులో ఉన్నాయి.

ధరలు పెరగడం శుభపరిణామం



జామాయిల్, సవక కర్ర ధరలు పెరగడం శుభపరిణామం. ఇతర పంటలకు ప్రత్యామ్నాయంగా రైతులు ఆర్థికంగా కొంత నిలదొక్కుకునేందుకు అవకాశం ఉంటుంది. ధరలు తక్కువగా ఉన్న సమయంలో చాలా మంది రైతులు సవక, జామాయిల్ సాగు జోలికి వెళ్లలేకపోయారు.

– రామిరెడ్డి, రైతు, కొనగలూరు

ఆర్చరీ పోటీల్లో సత్తా



నాయుడుపేట టౌన్: పట్టణానికి చెందిన గణేష్ మణిరత్నం అనే విద్యార్థి ఆర్చరీ పోటీల్లో సత్తా చాటారు. అంతర్జాతీయ స్థాయిలో దక్షిణ కొరియాలో నిర్వహించిన ఆర్చరీ పోటీల్లో రాణించి కాంస్య పతకాన్ని సాధించారు. గణేష్ మణిరత్నం, కోచ్ కమల్‌కిషోర్‌ను ఏపీ ఆర్చరీ సంఘ కార్యదర్శి సత్యనారాయణ అభినందించారు.

ఈతకెళ్లి యువకుడి గల్లంతు



రాపూరు: స్నేహితులతో సరదాగా ఈతకెళ్లిన యువకుడు గల్లంతైన ఘటన రాపూరు మండలంలోని రాపూరు – చిట్వేలి ఘాట్‌రోడ్డులో గల సిద్దేశ్వర కోన వద్ద ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై మాల్యాద్రి వివరాల మేరకు.. నెల్లూరులోని మూడో మైలుకు చెందిన మహేంద్ర (18) నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. స్నేహితులతో కలిసి కోనేరులో ఈత కొట్టేందుకు వచ్చి గల్లంతయ్యారు. పోలీసులు గాలిస్తున్నారు.

కనకదుర్గమ్మకు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు



పొంగళ్లు సమర్పించేందుకు బారులుదీరిన భక్తులు

బిట్రగుంట: బోగోలు మండలం కోవూరుపల్లిలో కనకదుర్గమ్మకు పొంగళ్లు పొంగించే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. రెండేళ్లకోసారి ఊరంతా ఏకమై గ్రామదేవత పోలేరమ్మ చెల్లెలైన కనకదుర్గమ్మకు పొంగళ్లు పొంగించడం ఆనవాయితీ. ఈ క్రమంలో కనకదుర్గమ్మకు పొంగళ్లు నివేదించే కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం కనకదుర్గమ్మ విగ్రహాన్ని ఊరేగింపుగా గ్రామ పొలిమేరలోని పొలాల్లోకి తీసుకొచ్చి కొలువుదీర్చారు. భారీగా తరలివచ్చిన గ్రామస్తులు, బంధుమిత్రులు, చుట్టుపక్కల గ్రామాల వారు సామూహికంగా పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అక్కడే వంటలు పూర్తి చేసి సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం మరోమారు పూజలు నిర్వహించి డప్పు వాయిద్యాలతో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. కోవూరుపల్లితో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. పోలేరమ్మకు గ్రామోత్సవం, పొంగళ్ల నివేదన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నారు.



కోవూరుపల్లిలో కొలువుదీరిన కనకదుర్గమ్మ

ఉరేసుకొని బాలిక ఆత్మహత్య

పొన్నలూరు: ఉరేసుకొని బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ప్రకాశం జిల్లా పొన్నలూరులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, బంధువుల వివరాల మేరకు.. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన రాజా కుటుంబసభ్యులు బతుకుదెరువు నిమిత్తం పొన్నలూరుకు కొన్నేళ్ల క్రితం వచ్చారు. స్థానికంగా రూమ్‌ను అద్దెకు తీసుకొని హోటల్‌ను నడుపుతున్నారు. ఈ క్రమంలో టీ పెట్టాలని తన చిన్న కుమార్తె యామిని (17)కి ఉదయం 11 గంటల సమయంలో సూచించారు. దీంతో ఇంట్లోకి వెళ్లిన యామిని ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో ఇంట్లోకి వెళ్లి రాజా చూశారు. అప్పటికే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొని ఉండటాన్ని గమనించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కిందికి దించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. ఎస్సై రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల విడుదల

నెల్లూరు(అర్బన్): ఐఐటీ, ఎన్ఐటీతో పాటు కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశానికి సంబంధించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాలను ఆదివారం విడుదల చేశారు. గత నెల్లో రెండు విడతల్లో నిర్వహించిన పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 2,800 మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో జిల్లా విద్యార్థులు సత్తాచాటి మంచి ర్యాంకులను సాధించడంతో పాటు 75 శాతం మంది ఉత్తీర్ణత పొందారు. అర్హత సాధించిన విద్యార్థులకు కౌన్సెలింగ్‌ను ఈ నెల పది నుంచి జూలై 23 వరకు నిర్వహించనున్నారు. నెల్లూరుకు చెందిన సూరజ్ ఓబీసీ కేటగిరీలో ఆలిండియా 11వ ర్యాంక్‌ను సాధించారు. బిరుదరాజు బద్రినాథ్‌వర్మ 27, లావణ్య చంద్రిక 439, చక్రేష్ 523, శ్రీకాంత్ 638, చరితసాయి సుష్మ 752, విరించి 843, సుబ్రహ్మణ్య కల్యాణరామ్ గణేష్, 1138 ర్యాంక్‌ను పొందారు. ఎస్సీ కేటగిరీలో రూపేష్ 93, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో సాయినితీష్ 151, రితీష్‌రెడ్డి 206, మనోజ్‌కుమార్ 542 ర్యాంక్‌లను సాధించారు.

నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతా..



మా తండ్రి దరియా సాహెబ్ ప్రైవేట్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా.. తల్లి మల్లీశ్వరి స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్నారు. నారాయణ కళాశాలలో చదివా. ఐఐటీలో సీటు సాధించడం ఆనందంగా ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌ను పూర్తి చేసి నూతన ఆవిష్కరణలతో సమాజానికి ఉపయోగపడతా. – సూరజ్

కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరవుతా..



తండ్రి మహేంద్రకృష్ణ, తల్లి సునీత ప్రభుత్వ టీచర్లుగా పనిచేస్తున్నారు. కష్టపడి చదివి జాతీయ స్థాయిలో మంచి ర్యాంక్‌ను సాధించడం ఆనందంగా ఉంది. కంప్యూటర్ సైన్స్ చదివి ఇంజినీరవుతా.

– సుబ్రహ్మణ్య కల్యాణరామ్ గణేష్

సైన్స్ పాత్ర ఎంతో కీలకం

ఒంగోలు సెంట్రల్: సైన్స్ పాత్ర ఎంతో కీలకమని, తాత్విక భావనగా సైన్స్‌ను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. ఒంగోలులోని ఎల్బీజీ భవన్‌లో జనవిజ్ఞాన వేదిక నాలుగు జిల్లాల జోనల్ స్థాయి వర్క్‌షాప్‌ను జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గేయానంద్ మాట్లాడారు. బాల్యంలోనే శాస్త్రీయ దృక్పథాన్ని బాలల మేధస్సుకు అందించాలని కోరారు. జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, జిల్లా గౌరవ సలహాదారుడు పుల్లారావు, ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ జాతీయ కమిటీ సభ్యులు డాక్టర్ కాలేషా, జయప్రకాశ్, దార్ల బుజ్జిబాబు, నేతలు మాలకొండారెడ్డి, సుబ్రహ్మణ్యం, భాస్కర్, తిరుపతయ్య, కృష్టారెడ్డి, మాదాల రాము, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గేయానంద్

ఓటీటీకే ఓటు

ఓటీటీలు.. ఐదేళ్ల క్రితం వరకు వీటికి ఉన్న ఆదరణ పరిమితం. కానీ కోవిడ్ మహమ్మారి సమయంలో విధించిన లాక్‌డౌన్‌తో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఆ సమయంలో వినూత్న కంటెంట్, సరికొత్త సినిమాలతో ఇవి ప్రజలను ఆకర్షించాయి. చౌకైన ప్లాన్లు, ఇంటిల్లిపాది చూసే అవకాశం లభించడంతో వీటికి లభిస్తున్న ఆదరణ ఆకాశాన్నంటుతోంది. ఓటీటీల పుణ్యమానని థియేటర్లకు వెళ్లే వారి సంఖ్య తగ్గుతోందంటే క్షేత్రస్థాయిలో వీటికి ఉన్న క్రేజ్ ఏమిటో అర్థమవుతోంది.

- స్ట్రీమింగ్ యాప్‌లపై క్రేజ్
- సినిమా విడుదలైన వారాల్లోనే ప్రత్యక్షం
- కుటుంబంతో కలిసి ఇంటి నుంచే వీక్షించే సౌలభ్యం
- ప్రత్యేక ప్యాకేజీలతో ఆకర్షిస్తున్న యాప్‌లు
- థియేటర్లకు వెళ్లే వారి సంఖ్య తగ్గుముఖం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఓటీటీలకు లభిస్తున్న ఆదరణ థియేటర్లకు అశనిపాతంలా పరిణమిస్తోంది. వెండితెర 70 ఎంఎం నుంచి మల్టీప్లెక్స్‌ల స్థాయికి ఎదిగింది. అయితే చుక్కలు చూపిస్తున్న టికెట్ ఖరీదు.. పార్కింగ్.. స్నాక్స్ ధరలతో థియేటర్లకు వెళ్లాలంటేనే ప్రేక్షకులు జంకుతున్నారు. ఈ పరిణామాలు ఓటీటీలకు వరంలా మారుతున్నాయి.

కొన్ని రోజుల్లోనే ఓటీటీల్లో ప్రత్యక్షం

ఆధునిక టెక్నాలజీని అందుపుచ్చుకొని స్మార్ట్ టీవీల్లోనే ఓటీటీ యాప్‌లు ఉండటం.. కొత్త చిత్రాలు విడుదలైన కొన్ని రోజుల్లోనే ఇందులో ప్రత్యక్షమవుతున్నాయి. దీంతో ఇంట్లోనే కూర్చొని థియేటర్లో చూసే అనుభూతిని ప్రజలు పొందుతున్నారు.

సబ్‌స్క్రిప్షన్లతో ఆకర్షిస్తూ..

చౌకగా లభిస్తున్న ఇంటర్నెట్.. పెరుగుతున్న స్మార్ట్ ఫోన్లతో ఓటీటీకి ఉన్న డిమాండ్ అమాంతం పెరుగుతోంది. మరోవైపు కొత్త సబ్‌స్క్రిప్షన్ ప్లాన్లతో ఓటీటీలు ఆకర్షిస్తున్నాయి. పెద్ద హీరోల నుంచి చిన్న హీరోల వరకు.. భారీ బడ్జెట్ నుంచి తక్కువ స్థాయి బడ్జెట్ వరకు కొన్ని సినిమాలు నేరుగా ఓటీటీల్లోనే విడుదలవుతుండగా.. మరికొన్ని వారం, పది రోజుల్లో ప్రత్యక్షమవుతున్నాయి. హెచ్‌డీ క్వాలిటీలో ఇవి ఉండటంతో ఎక్కువ మంది ఆకర్షితులవుతున్నారు. మరోవైపు కుటుంబంతో కలిసి ఒక సినిమాకు వెళ్తే అయ్యే ఖర్చు.. ఏడాది మొత్తానికి లభించే సబ్‌స్క్రిప్షన్ ధర ఒక్కటే అవుతుండటం గమనార్హం.



మూతపడుతున్న థియేటర్లు

నెల్లూరు, ఆత్మకూరు, కావలి, బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీలతో పాటు కోవూరులో మొత్తం 30 థియేటర్లు ఉన్నాయి. నెల్లూరు మినహా మిగిలిన ప్రాంతాల్లో ఏసీ, నాన్ ఏసీ థియేటర్లే ఎక్కువ. బిట్రగుంట, రాజుపాళెం తదితర ప్రాంతాల్లోని థియేటర్లు మూతపడ్డాయి. ప్రస్తుత రోజుల్లో చిన్న థియేటర్ల నిర్వహణ కష్టమవుతోంది. ఫలితంగా కొన్ని థియేటర్లు కల్యాణ మండపాలుగా.. మరికొన్ని గోడౌన్లుగా మారుతున్నాయి.

సినిమాకు వెళ్తే రూ.రెండు వేల ఖర్చు



సినిమా చూసేందుకు థియేటర్లకు వెళ్లాలంటే ఖర్చులు ఎక్కువైపోతున్నాయి. ఓ కుటుంబం సినిమాకు వెళ్తే దాదాపు రూ.రెండు వేలు ఖర్చవుతోంది. టికెట్ ధరలూ అధికంగా ఉన్నాయి. స్నాక్స్ ధరలు దీనికి మించి రెండింతలవుతున్నాయి. ధరల నియంత్రణపై ఎవరూ చర్యలు చేపట్టడం లేదు. థియేటర్లలో వచ్చిన చిత్రాలు వారం, పది రోజుల్లోనే ఓటీటీల్లో ప్రత్యక్షమవుతున్నాయి.

– కృష్ణారెడ్డి, నెల్లూరు

సెల్‌ఫోన్లోనే చూస్తున్నాం



ఓటీటీలో విడుదలవుతున్న కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లను సెల్‌ఫోన్లోనే చూస్తున్నాం. గతంలో సెలవు దినాల్లో థియేటర్‌కు వెళ్లే వాళ్లం. ఇప్పుడా అవసరమే లేదు. ఇంటర్నెట్ ఉంటే టీవీలోనూ కొత్త సినిమాలు చూస్తున్నాం. టీవీ సీరియళ్లను సైతం ఓటీటీలో చూసే అవకాశం ఉంది. తక్కువ ఖర్చుతోనే వినోదాన్ని ఆస్వాదిస్తున్నాం.

– జ్ఞానదీప్

క్లుప్తంగా

31 బైక్‌లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో జలదంకి పోలీసులు

నెల్లూరు సిటీ: జిల్లాలోని పలు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్‌ను పోలీసులు ఆదివారం నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణ, చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టుటలో భాగంగా సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ చేపట్టారు. ఆయా ప్రాంతాల డీఎస్పీల ఆధ్వర్యంలో సీఐ, ఎస్సైలు స్పెషల్ పార్టీ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 31 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కాగా జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు, హింసాత్మక ఘటనలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం



కాలిపోయిన ఫర్నిచర్

అనుమసముద్రంపేట: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగి గృహోపకరణాలు దగ్ధమైన ఘటన అనుమసముద్రంలోని అంబేడ్కర్ కాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. అంబేడ్కర్‌కాలనీకి చెందిన పైడి వేమనారాయణ ఇంట్లో మధ్యాహ్నం 2 గంటల సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రమాదం జరిగిన సమయంలో వేమనారాయణ కుటుంబ సభ్యులెవరూ ఇంట్లో లేరు. చుట్టుపక్కల వారు గమనించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని టీవీ, ఫ్రిడ్జ్, ఫర్నిచర్‌తో పాటు ఇతర విలువైన వస్తువులు కాలిపోయాయి. సుమారు రూ.లక్ష మేర ఆస్తి నష్టం సంభవించిందని బాధితులు వాపోయారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని వేడుకున్నారు.

ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజీనామా

మార్కాపురం టౌన్: ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీ బేగ్ తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీకి పంపినట్లు మార్కాపురంలో ఆదివారం ఆయన విలేకరులకు తెలిపారు. దీంతో పాటు మార్కాపురం అగ్రికల్చర్ మార్కెట్ యార్డు చైర్మన్ పదవికి కూడా రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్ : పట్టణ పరిధిలోని తుమ్మూరు పాత చెక్‌పోస్టు సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. ఓజిలి మండలం ముమ్మాయపాళేనికి చెందిన దొడ్ల నాగరాజు, కోట మండలం రాఘవపురానికి చెందిన శేషయ్య ప్రైవేట్ బస్సు డ్రైవర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని తుమ్మూరు పాత చెక్‌పోస్టు సమీపంలో ఉన్న బస్సును తీసుకెళ్లేందుకు రోడ్డును దాటుతున్న క్రమంలో గూడూరు వైపు వెళుతున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 సిబ్బంది స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హెడ్‌కానిస్టేబుల్ మధు ప్రమాదం జరిగిన తీరును బాధితులను అడిగి తెలుసుకున్నారు. కారు నంబరును స్థానికులు గుర్తించి పోలీసులు తెలిపారు.

జాతీయ స్థాయి సెమినార్‌కు తాళ్లూరు ఏఓ

తాళ్లూరు (ముండ్లమూరు): వ్యవసాయంలో మేలైన పద్ధతులపై హైదరాబాద్‌లోని ఎన్ఐఏఆర్‌డీలో ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సెమినార్‌కు ప్రకాశం జిల్లా తాళ్లూరు మండల వ్యవసాయాధికారి బీ ప్రసాదరావు ఎంపికయ్యారు. వ్యవసాయంలో వస్తున్న నూతన మేలైన పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని పాటించి విదేశాలకు మన పంట ఉత్పత్తులు అమ్ముకునేందుకు కావాల్సిన స్కోప్ సర్టిఫికెట్ పొందే విధానంపై సెమినార్‌లో శిక్షణ ఇవ్వనునట్లు ఆయన తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 164
లేయర్ (లైవ్)	: 120
బ్రాయిలర్ చికెన్	: 288
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 318
లేయర్ చికెన్	: 204



నిత్యావసరాలు.. ఇంటి ముంగిటకే

- కావలిలో విస్తరిస్తున్న డోర్‌డెలివరీ సేవలు
- యాప్స్, సోషల్ మీడియా వేదికగా ఉపాధి పొందుతున్న యువత

కావలి: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం..స్మార్ట్‌ఫోన్ టెక్నాలజీ...ఇంటర్నెట్ విస్తృత వినియోగం ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చేశాయి. వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా యాప్స్ సమాచార మార్పిడిలో సరికొత్త విప్లవం సృష్టించాయి. స్విగ్గీ,జొమాటో వంటి ఫుడ్, సరుకుల డెలివరీ యాప్స్ ఏం కావాలన్నా కాలు బయట పెట్టకుండానే ఇంటి ముంగిటకే తెచ్చుకునే సౌలభ్యాన్ని కల్పించాయి. కావలి వంటి చిన్నచిన్న పట్టణాల్లోనూ వీటి సేవలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ యాప్స్‌కు దీటుగా స్థానిక యువత కూడా సొంతంగా యాప్స్, సోషల్ మీడియా పేజీల ద్వారా నాణ్యమైన డోర్‌డెలివరీ సేవలు అందిస్తూ సత్తా చాటుతున్నారు. ఆర్డర్ ఇచ్చిన అరగంటలోనే కూరగాయలు, పాలు, పండ్లు, నిత్యావసర సరుకులు, స్వీట్లు, చికెన్, ఊరగాయలు, తదితరాల ను నేరుగా ఇంటి ముంగిటకే చేరుస్తూ కార్పొరేట్ యాప్స్‌కు షాక్ ఇస్తున్నారు. ఈ యాప్స్, సోషల్ మీడియా పేజీలు నిర్వహించే వారంతా స్థానిక యువతే కావడంతో జవాబుదారీతనంతో పాటు నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పట్టణవాసులు కూడా వీరిని ప్రోత్సహిస్తున్నారు.

స్విగ్గీ, జొమాటోకు పోటీగా ర్యాపిక్స్

పట్టణంలో విస్తరిస్తున్న స్విగ్గీ, జొమాటో యాప్స్‌కు పోటీగా కావలికి చెందిన నలుగురు యువకులు నూతన యాప్‌ను రూపొందించారు. కడనూతలలోని ఆర్ఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారు కార్పొరేట్ కంపెనీల్లో జాబ్స్‌ను కూడా కాదనుకుని సొంతంగా ర్యాపిక్స్ యాప్‌ను తయారు చేశారు. ఈ యాప్ ద్వారా పాలు, పండ్లు, కూరగాయలు, చికెన్, స్నాక్స్, తదితరాలను పూర్తి నాణ్యతతో, మార్కెట్ రేట్ కన్నా తక్కువ ధరలకే డోర్‌డెలివరీ చేస్తున్నారు. వ్యాపారులు, వినియోగదారులను ఒకే ప్లాట్‌ఫామ్ పైకి తీసుకొచ్చి నిర్వహణ ఖర్చులు తగ్గించడం ద్వారా అటు వ్యాపారులు, ఇటు వినియోగదారులకు ప్రయోజనం కల్పిస్తున్నారు. ఉదాహరణకు ఈ యాప్ ద్వారా కేజీ చికెన్ ఆర్డర్ చేస్తే బయట ధరలకన్నా రూ.30 తక్కువకే అందించడంతో పాటు ఆర్డర్ చేసిన అరగంటలోనే ఇంటికి చేరుస్తున్నారు. పాలు, కూరగాయలు, ఇతర వస్తువులపైన 5 నుంచి 10 శాతం డిస్కౌంట్ అందిస్తున్నారు.



ఇన్‌స్టాగ్రామ్‌లోని హోమీఫుడ్స్ పేజీ

ఇన్‌స్టాగ్రామ్ వేదికగా దుమ్మురేపుతున్న 'హోమీఫుడ్స్'

పట్టణంలోని విట్స్ కళాశాలలో ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న శ్రీనివాసులు 'హోమీఫుడ్స్' పేరుతో ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ పేజీల వేదికగా అదిరిపోయే రుచులతో హోమ్ ఫుడ్ అందిస్తున్నాడు. వినియోగదారులు కోరిన ఆహార పదార్థాలను ఇంటి వద్దనే రుచిగా తయారు చేయించి డోర్‌డెలివరీ చేస్తున్నాడు. శ్రీనివాస్ అందించే గులాబ్‌జామ్, ఫ్రూట్‌కస్టర్డ్, పాస్తా, గార్లిక్ బ్రెడ్‌కు ఇన్‌స్టాగ్రామ్ పేజీలో ప్రత్యేక ఫ్యాన్‌బేస్ ఉండడం విశేషం. బయట రెస్టారెంట్లు, హోటళ్లతో పోలిస్తే హోమీఫుడ్స్‌లో నాణ్యమైన, ఆర్టిఫిషియల్ రంగులు, రసాయనాలు కలపని రుచికరమైన ఆహారం అందిస్తుండడంతో వినియోగదారుల ఆదరణ కూడా ఎక్కువగానే ఉంది.



కావలి యువత రూపొందించిన ర్యాపిక్స్ యాప్

30 నిమిషాల్లో చికెన్ డోర్ డెలివరీ

పట్టణంలో తొలిసారిగా 'ఏఆర్ ప్రీమియం చికెన్' పేరుతో బ్రాండెడ్ ఔట్‌లెట్ ప్రారంభించిన యువకులు ఫోన్ చేసిన 30 నిమిషాల్లోనే ఎటువంటి సర్వీసు చార్జీలు తీసుకోకుండానే చికెన్‌ను డోర్‌డెలివరీ చేస్తూ దూసుకుపోతున్నారు. వినియోగదారుల అభిరుచి మేరకు స్కిన్, స్కిన్‌లెస్, బోన్, బోన్‌లెస్‌లలో ఏం కావాలన్నా అప్పటికప్పుడు సిద్ధం చేయించి డోర్‌డెలివరీ చేస్తుండటంతో వినియోగదారులు ఆదరిస్తున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ పేజీల ద్వారానే వీరికి ఎక్కువగా ఆర్డర్స్ వస్తుండడం గమనార్హం. వంద శాతం హలాల్ చేసిన మీట్‌ను, నాణ్యతతో అందిస్తుండటంతో వినియోగదారుల ఆదరణ కూడా ఎక్కువగానే ఉంది.అదే విధంగా కావలి పికెల్స్, కావలి ఫుడ్స్ వంటి ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ పేజీలు కూడా పట్టణ ప్రజలకు నాణ్యమైన ఆహార ఉత్పత్తులను డోర్‌డెలివరీ చేస్తున్నాయి. స్థానికంగా మంచి ఫాలోయింగ్ ఉండే వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపులు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ పేజీలు వీరికి ప్రచారం కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నాయి.

ఆదరణ బాగుంది



ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ పేజీల ద్వారా హోమీఫుడ్స్‌కు ప్రతిరోజూ 20 వరకు ఆర్డర్లు వస్తున్నాయి. నెలరోజుల క్రితమే ప్రారంభించినా కస్టమర్ల నుంచి ఆదరణ బాగుంది. స్విగ్గీ, జొమాటో వంటి యాప్స్‌లో లిస్టింగ్ ఫీజు, ప్లాట్‌ఫామ్ ఫీజు, కమీషన్, డెలివరీ ఛార్జీలు అంటూ అసలు ధర కన్నా 30 నుంచి 35 శాతం ఎక్కువగా చార్జి చేస్తున్నారు. హోమీఫుడ్స్‌లో ఇటువంటివి ఉండవు. పైగా ఇంటి వంట కావడం, నాణ్యతగా అందిస్తుండడంతో అందరూ ఆదరిస్తున్నారు.

– శ్రీనివాస్, హోమీఫుడ్స్

వ్యాపారులు, వినియోగదారులకు వారధిగా ర్యాపిక్స్



వ్యాపారులు, వినియోగదారులకు ఇద్దరికీ లబ్ధి కలిగేలా ర్యాపిక్స్ యాప్‌ను రూపొందించడం జరిగింది. యాప్ ద్వారా కొనుగోలు చేసే ప్రతి వస్తువుపైనా డిస్కౌంట్ లభిస్తుంది. బయట మార్కెట్‌లో లభించే వాటికన్నా తక్కువ ధరకే వస్తువులు లభిస్తాయి. వినియోగదారులు కోరుకున్న ఏ వస్తువులైనా ఆర్డర్ చేసిన 30 నిమిషాల్లోనే డెలివరీ చేసేలా యాప్, డెలివరీ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నాం.

– పీ దేవారెడ్డి, ఫౌండర్

దాడులకు తెగబడుతున్న టీడీపీ

కావలి: కావలి నియోజకవర్గ వ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించిన తరువాత టీడీపీ కార్యకర్తలు చెలరేగిపోతున్నారు. కావలి పట్టణంతో పాటు పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై వరుస దాడులకు తెగబడుతున్నారు. కవ్వింపు చర్యలతో నిత్యం రెచ్చగొట్టే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. కావలి పట్టణం, దగదర్తి, అల్లూరు మండలాల్లో ఇప్పటికే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై భౌతికదాడులకు పాల్పడగా, బోగోలు మండలంలో ఏకంగా పోలీసులకే తిప్పకు చెందిన టీడీపీ కార్యకర్తలు హుకుం జారీ చేశారు. 'మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది, గతంలో మాదిరి ఎవరు పడితే వాళ్లు వచ్చి సోదాలు, అరెస్టులు అంటే కుదరదు. ఎవరు రావాలన్నా ముందు మాకు చెప్పాల్సిందే' అంటూ పోలీసులకే హెచ్చరికలు జారీ చేశారని తెలిసింది. తాజాగా కావలిలోని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసం ముందు టీడీపీ కార్యకర్తలు వీరంగం సృష్టించారు. డీజే పెట్టి టపాసులు పేలుస్తూ రెచ్చగొట్టే ధోరణిలో డ్యాన్స్‌లు వేశారు. సవాళ్లు విసురుతూ ఇంటి గేటును కాళ్లతో తన్నుతూ విధ్వంసానికి ప్రయత్నించారు. దగదర్తి ఎంపీపీ తాళ్లూరి ప్రసాద్ నాయుడు ఇంటి ముందు టపాసులు కాల్చడంతో పాటు వాటిని నేరుగా ఇంట్లోకి విసిరేశారు. దగదర్తికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కాండ్ర శ్రీనివాసులు ఇంటి నిర్మాణాన్ని టీడీపీ నాయకులు ఆదివారం జేసీబీతో కూల్చేశారు. ఇదే తరహాలో టీడీపీ కార్యకర్తలు కవ్వింపు చర్యలకు దిగుతుండడంతో పలు గ్రామాల్లో భయానక వాతావరణం నెలకొంది. ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం చోద్యం చూస్తున్నారే తప్ప కేసులు నమోదు చేయడం లేదు. బాధితులు స్టేషన్‌కు వెళ్లినా సర్దిచెప్పి వెనక్కి పంపిస్తున్నారే తప్ప కేసుల జోలికి వెళ్లడం లేదు.



టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన తడకలూరు సర్పంచ్ గిరినాయుడు

కౌంటింగ్ తరువాత చోటు చేసుకున్న కొన్ని ఘటనలు...

- దగదర్తికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కాండ్ర శ్రీనివాసులకు చెందిన ఇంటి నిర్మాణాన్ని జేసీబీతో కూల్చేశారు. ఇంటిని జేసీబీతో కూల్చివేస్తూ గట్టిగట్టిగా అరుస్తూ సెల్‌ఫోన్‌లలో చిత్రీకరించి వైరల్ చేసి అందరికీ ఇదే గతి పడుతుందని హెచ్చరికలు జారీ చేశారు.
- దగదర్తి ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు ఇంటి ముందు టపాసులు కాల్చి కవ్వింపు చర్యలకు దిగారు. టపాసులకు నిప్పంటించి ఇంటి ప్రాంగణంలోకి, పార్క్ చేసి ఉన్న కారు పైకి విసిరేశారు.
- దగదర్తి మండలం యలమంచిపాడులో వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారని షేక్ మస్తాన్, అతని తల్లి 75 ఏళ్ల బీబీపైన దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.
- దగదర్తి మండలం తడకలూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త యలమా వెంకటేశ్వర్లుకు చెందిన ద్విచక్ర వాహనాన్ని టీడీపీ కార్యకర్తలు పెట్రోల్ పోసి కాల్చేశారు.
- దగదర్తి మండలంలో వైఎస్సార్‌సీపీకి చెందిన తడకలూరు సర్పంచ్ ఆత్మకూరు గిరినాయుడుపై టీడీపీ నాయకులు ఆదివారం దాడికి పాల్పడ్డారు. అధికారం తమ చేతుల్లో ఉందనే అహంకారంతో దాడి చేసి గాయపరిచారు.
- బోగోలు మండలం తిప్పకు చెందిన టీడీపీ నాయకుడు ఏకంగా పోలీసులకే హుకుం జారీ చేశాడు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది, ఇకపై తిప్పలో ఏ పోలీస్ తిరగాలన్నా ముందు మాకు చెప్పాల్సిందేనని హెచ్చరించాడు. దీంతో ఖాకీలే ఖంగు తిన్నారు.
- కావలిలో చెదురుమదురుగా జరిగిన దాడుల్లో టీడీపీ నాయకుల చేతిలో ఆరు మంది వరకు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు గాయపడ్డారు. ఇప్పటి వరకు పోలీసులు ఒక్క కేసు కూడా నమోదు చేయలేదు.
- కావలిలోని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసం ఎదుట టీడీపీ నాయకులు, కార్యకర్తలు డీజే పెట్టి, టపాసులు పేలుస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఎమ్మెల్యే ఇంటి గేటును కాళ్లతో తన్నుతూ సెక్యూరిటీ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించారు.



ప్రకృతి సోయగం

నైరుతి రుతుపవనాల ప్రభావంతో మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ తరుణంలో సంగం మండలంలోని దువ్వూరు వద్ద ఆదివారం ఆకాశంలో విరిసిన ఇంద్రధనస్సు కనువిందు చేసింది. చేపల గుంతల్లోనూ దీని ప్రతిబింబం దర్శనమిచ్చింది. ఈ సుందర దృశ్యాన్ని సాక్షి తన కెమెరాలో బంధించింది.

– సంగం

రాంగ్‌రూట్‌లో వెళ్లి మృత్యుఒడికి

- ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి
- మరొకరికి తీవ్రగాయాలు

నెల్లూరు సిటీ: బైక్‌పై రాంగ్‌రూట్‌లో వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందారు. ఈ ఘటన నగరంలోని అయ్యప్పగుడి వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు...పొదలకూరురోడ్డులోని సంజీవ్‌గాంధీనగర్‌లో గోపాల్‌రామ్ (47)నివాసం ఉంటున్నారు. ఆయన ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. శనివారం రాత్రి ఆయన అయ్యప్పగుడి వద్ద బైక్‌పై వెళ్తూ రాంగ్‌రూట్‌లో టర్నింగ్ తీసుకుంటుండగా అయ్యప్పగుడి నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో గోపాల్‌రామ్ అక్కడికక్కడే మృతి చెందారు. బైక్‌పై వెనుక కూర్చున్న పసుపులేటి దుర్గామహేష్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడ్ని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు కింద నలిగి వృద్ధురాలు..

కారు ఢీకొనడంతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన బీవీ నగర్‌లోని స్నేహా నగర్ ప్రాంతంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు..స్నేహానగర్ ప్రాంతంలో 70 ఏళ్ల యాచకురాలు రోడ్డు పక్కన కూర్చుని ఉంది. వర్షం పడుతుండడంతో కారు డ్రైవర్ గమనించక వాహనాన్ని పైకి ఎక్కించడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వృద్ధురాలి మృతదేహం

దారి కాచి.. కత్తులు ఉన్నాయని బెదిరించి

- బైక్ అపహరణ

తడ: గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు రాత్రి వేళ దారి కాచి ప్రైవేట్ పరిశ్రమలోకి విధులకు వెళ్తున్న సిబ్బందిని అటకాయించారు. తమ వద్ద కత్తులున్నాయని బెదిరించారు. ఆపై బైక్‌ను అపహరించుకెళ్లారు. ఈ ఘటన శనివారం రాత్రి మాంబట్టు సెజ్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై పీ నరసింహారావు వివరాల మేరకు.. తిరుపతి జిల్లా వరదయ్యపాళెం మండలం పులివెల్లం గ్రామానికి చెందిన పరంధామ, రవి మాబ ట్టు సెజ్‌లోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. శనివారం రాత్రి విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై మాంబట్టు సెజ్ పరిధిలోకి వచ్చా రు. అక్కడ చీకటిలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు పెద్ద మాంబట్టు వద్ద జామాయిల్ తోటలో నుంచి బయటకు వచ్చి బైక్‌ను అడ్డగించారు. తమ వద్ద కత్తులున్నాయని, ఎదిరిస్తే చంపేస్తామని, మర్యాదగా మీ వద్ద ఉన్న వస్తువులు ఇచ్చి వెళ్లాలని బెదిరించారు. దీంతో భయపడ్డ బాధితులు బైక్ వదిలి పారిపోయారు. కొంత సమయం తర్వాత వచ్చి చూసేసరికి బైక్ లేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

తీర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండండి



కోడూరు బీచ్‌లో బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై జంపాని కుమార్

తోటపల్లిగూడూరు: జోరుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు, బీచ్‌లకు వచ్చే పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జంపాని కుమార్ హెచ్చరించారు. ఆదివారం ఆయన తన సిబ్బందితో కలిసి కోడూరు, కాటేపల్లి బీచ్‌లలో బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కోడూరు, కాటేపల్లి సముద్రతీరాల్లో అసాధారణ స్థాయిలో నీటి మట్టాలు పెరిగాయన్నారు. ఈ నేపథ్యంలో బీచ్‌ల సందర్శనకు వచ్చే పర్యాటకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లోతుకు వెళ్లకుండా ఒడ్డునే సముద్ర స్నానాలు ఆచరించాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వేటకు వెళ్లే సమయంలో మత్స్యకారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏ సహాయం కావాలన్నా పోలీస్ శాఖను సంప్రదించాలని సూచించారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.77
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.30

